క్లుప్తంగా

సన్మానం



జనగామ: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ చైర్మన్ల పదవీకాలం ముగిసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మాజీ చైర్మన్ల సన్మాన కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సమితి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్యను కల్వకుంట్ల తారక రామారావు ఘనంగా సన్మానించారు.

అభినందనీయం

స్టేషన్‌ఘన్‌పూర్: కార్మికుల సమస్యల పరిష్కారంలో డీఈ రాంబాబు చొరవ అభినందనీయమని ఐఎన్‌టీయూసీ–327 రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్ అన్నారు. మండల కేంద్రంలోని ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఉత్తమ ఉద్యోగ అవార్డులు పొందిన డీఈ రాంబాబు, టౌన్ ఏఈ శంకర్, కొడకండ్ల ఇన్‌చార్జ్ ఏఈ రాకేశ్, టౌన్ లైన్‌మన్ వాసం శ్రీధర్‌లను ఐలేష్ సన్మానించారు. డివిజన్ అధ్యక్షుడు యాదగిరి, రాజ్‌కుమార్, ఫయాజ్, సుధాకర్, నరసింహారెడ్డి, వీరస్వామి, చంద్రశేఖర్, రాజేందర్, లక్ష్మి, వెంకటేష్, రమణాచారి, దేవిక, ఫాహిని, అన్వర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి మ్యాథమెటిక్స్ పరీక్షలో ప్రతిభను చాటి ప్రశంసపత్రాలతో పాటు మెడల్స్‌ను సాధించినట్లు హెచ్‌ఎం మరియా జోసఫ్ తెలిపారు. పాఠశాలలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికి గాను జాతీయస్థాయి మ్యాథమెటిక్స్ పరీక్షలో పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారని చెప్పారు. ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.


‘కురుమలు చైతన్యం కావాలి’

బచ్చన్నపేట: మారుతున్న కాలానికి అనుగుణంగా కురుమలు అన్ని రంగాల్లో చైతన్యవంతులు కావాలని కురుమ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి చౌదరిపల్లి రవికుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీరప్ప గుడి ప్రాంగణంలో సంఘం మండల అధ్యక్షుడు జూకంటి కిష్టయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం నూతన యువజన మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా అత్కూరి కనుకయ్య, అధ్యక్షుడిగా కర్రె నరేశ్, ఉపాధ్యక్షులుగా మ్యాకల రమేష్, బండారి అశోక్, పరిదె శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా బుడిగె నవీన్, కోశాధికారిగా కర్రె అశోక్, ప్రచార, సంయుక్త కార్యదర్శులుగా బియ్య అశోక్, జంగిలి రాజు, మల్ల కర్ణాకర్, ఎనుగుల నాగరాజు, చెట్కూరి నాగరాజులను ఎన్నుకున్నారు. సమావేశంలో సిద్దులు, శ్రీనివాస్, చంద్రయ్య, సిద్దులు, కర్ణాకర్ పాల్గొన్నారు.

విద్యతోనే ముందడుగు

చిల్పూరు: విద్యతోనే ముందడుగు సాధ్యమని.. అందుకు విద్యార్థులు ఇష్టంతో చదవాలని సైకాలజిస్ట్ అశోక్ అన్నారు. మండలంలోని రాజవరం గ్రామ సమీపంలోని కేజీబీవీలో శుక్రవారం ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పరీక్షల్లో విజయం సాధించాలంటే అనే అంశంపై ఎస్‌ఓ ప్రశాంతి అధ్యక్షతన విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నందున విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అలాగే సీనియర్ వైద్యుడు అడెపు రాజేంద్రప్రసాద్ విద్యార్థులు చదువుకునే పద్ధతులు, భయాందోళనలను ఎలా ఎదుర్కోవాలో లాంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిని నిర్మూలిద్దాం



రఘునాథపల్లి: కుష్ఠువ్యాధిని నిర్మూలిద్దామని మండల వైద్యాధికారులు అన్నారు. మడలంలోని కోమల్ల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. కుష్ఠు అంటువ్యాధి కాదని, వారిని తాకినా ఇతరులకు వ్యాధి సోకదని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతకు ముందు కుష్ఠువ్యాధిని నిర్మూలిద్దాం.. వ్యాధిగ్రస్తులను అక్కున చేసుకుందామంటూ నినాదాలు చేశారు. వైద్యాధికారులు ఇంజమామ్‌ఆలీ, పావన, హెచ్‌ఎం జాన్‌సుందర్‌రావు, వైద్య సిబ్బంది భాగ్యలక్ష్మి, రజిత, ఆశ వర్కర్లు భాగ్యలక్ష్మి, హేమలత, సంపూర్ణ పాల్గొన్నారు.

రోడ్డు ధ్వంసమై రెండేళ్లు..!

- ఎఫ్‌డీఆర్‌లో రూ.4.50 లక్షల మంజూరు
- జాలు కాల్వ పనులు ప్రారంభమయ్యేదెప్పుడో..?
- నెల్లుట్ల రైతులు, కూలీల ఎదురు చూపులు



నెల్లుట్ల జాలు కాల్వ వద్ద ధ్వంసమైన రోడ్డు

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల గ్రామంలో జాలు కాల్వ గత రెండేళ్ల క్రితం కురిసిన వర్షాలతో వచ్చిన వరదలకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఆ రోడ్డు దాటే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు అవతలి వైపు వ్యవసాయ భూములు ఉన్న రైతులు, కూలీలు ఇబ్బందులు పడడమే కాకుండా గ్రామానికి సంబంధించిన వైకుంఠ దామం కూడా ఆ రోడ్డు అవతలి వైపే ఉంది. ఈ నేపథ్యంలో గ్రామస్తులంతా తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడంతో ఏడాది క్రితం గ్రామ పంచాయతీ నిధులు రూ.2లక్షలతో తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అదే రోడ్డుపై వెళ్తున్నారు. మళ్లీ వర్షాలు కురిసి నెల్లుట్ల పెద్ద చెరువు మత్తడి పోస్తే ఆ రోడ్డు ధ్వంసమయ్యే ప్రమాదం ఉంది. మళ్లీ వర్షాలు కురియక ముందే పనులు చేపట్టాలని రైతులు, వ్యవసాయ కూలీలు డిమాండ్ చేస్తున్నారు. అంతే కాకుండా జిల్లాలోనే ఉత్తమ నర్సరీగా పేరు గాంచి పదెకరాల్లో అనేక రకాల పండ్ల మొక్కలు, ఇతర మొక్కలు ఉన్న నర్సరీకి ప్రధాన రోడ్డు కరువైంది.

ఎఫ్‌డీఆర్‌లో రూ.4.50 లక్షలు మంజూరు

ఫ్లడ్ డామేజ్ రిపేర్స్ పనుల్లో భాగంగా నెల్లుట్ల జాలు కాలువ రోడ్డు మరమ్మతుకు రూ.4.50 లక్షలు మంజూరయ్యాయి. టెండర్లు కూడా పూర్తి అయినట్లు సమాచారం. త్వరలో పనులు చేపట్టి వర్షాకాలం లోగా పూర్తి చేస్తే ఇబ్బందులు ఉండవని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



రెండేళ్ల క్రితం జాలు కాలువ రోడ్డు తెగిపోయింది. దీంతో ఏడాది పాటు నానా ఇబ్బందులు పడ్డాం. ఏడాది క్రితం తాత్కాలిక రోడ్డు వేశారు. మళ్లీ వర్షాలు కురిస్తే ఆ రోడ్డు కూడా తెగిపోతుంది. ఇక వ్యవసాయ బావులకు, స్మశాన వాటికకు వెళ్లాంటే బైపాస్ మీదుగా యశ్వంతాపూర్ మీదుగా వెళ్లాల్సిందే.

– కొయ్యాడ శ్రీనివాస్, రైతు, నెల్లుట్ల

త్వరలో పనులు చేపడతాం..

ఎఫ్‌డీఆర్‌లో నిధులు మంజూరయ్యాయి. టెండర్లు కూడా పూర్తయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం. వర్షాకాలంలోగా పనులు పూర్తి చేయిస్తాం. రైతులకు, వ్యవసాయ కూలీలకు ఇబ్బంది లేకుండా చేస్తాం.

– శ్రీనివాస్, ఏఈ, పంచాయతీరాజ్ శాఖ

హక్కుల సాధనకు ఐక్యపోరాటాలు

బీసీ సంఘం నాయకులు



మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణలో మెజార్టీగా ఉన్న బీసీ కులాలకు చెందిన వారు తమ న్యాయమైన హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలు చేయాలని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు చిగురు విజయ్, పోశాల కృష్ణమూర్తి, మేకల మల్లేశం కోరారు. ఈనెల 2వ తేదీన హనుమకొండ ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న హలో బీసీ–ఛలో వరంగల్ బీసీ రాజకీయ యుద్ధభేరి సభను పురస్కరించుకుని ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో బీసీ సంఘం నాయకులు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా బీసీలు దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. బీసీలు రాజకీయంగా చైతన్యం కావాలని, జనాభా ప్రాతిపదికన బీసీలు తమ న్యాయమైన హక్కుల సాధన కోసం ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. హలో బీసీ–ఛలో వరంగల్‌సభకు బీసీలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు. నాయకులు శనబోయిన నాగేష్, అహ్మద్‌పాషా, కుమ్మం సతీష్, కుమ్మం ఉపేందర్, నీల రాములు, నీల రాకేష్, రాజు పాల్గొన్నారు.

బీసీ యుద్ధభేరి సభను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అశోక్ తదితరులు

చిల్పూరు: ఈనెల 2వ తేదీన హనుమకొండలో నిర్వహించనున్న బీసీ యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని ముదిరాజ్ మహాసభ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అలుగు అశోక్ కోరారు.ఈ మేరకు మండల కేంద్రంలో బీసీ యుద్ధభేరి వాల్‌పోస్టర్లను సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. జంగిటి కుమార్, యాకరాజు, కండ్లకోలు బాలరాజు, సాప్పిరి రాజు, నాగరాజు, రవి, కనకరాజు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు కీలకం



ప్రశంసపత్రాలు అందుకున్న పోలీసు అధికారులు, సిబ్బందితో కలెక్టర్ రిజ్వాన్ బాషా

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు కీలకమని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసుశాఖలోని ఉత్తమ ఉద్యోగులకు ప్రశంస పత్రాల ప్రదానోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా రక్షణకు పోలీసు శాఖ చేస్తున్న కృషి ఎనలేదని అన్నారు. అనంతరం పోలీసు శాఖకు చెందిన 69 మంది అధికారులు, సిబ్బందికి ఉత్తమ అవార్డులను కలెక్టర్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏఎస్పీ పండారి చేతన్ నితిన్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటిఎద్దడి తలెత్తకుండా చూడాలి

- ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సంధ్య



కొడకండ్ల: మాట్లాడుతున్న డీఈఈ సంధ్య

కొడకండ్ల/జఫర్‌గఢ్/బచ్చన్నపేట/జఫర్‌గఢ్/నర్మెట: వేసవి కాలంలో మండలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని గ్రామీణ తాగునీటి సరఫరా డీఈఈ సంధ్య కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాగశేషాద్రి అధ్యక్షతన నిర్వహించిన సమ్మర్ యాక్షన్ ప్లాన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ముందస్తు ప్రణాళిక కోసం 1 నుంచి 10వ తేదీ వరకు గ్రామాల్లో మిషన్ భగీరథ అధికారులు పర్యటించి యాక్షన్ ప్లాన్ తయారు చేసేందుకు సూచనలివ్వడం జరుగుతుందని, వేసవిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎంపీఓ ఇందిర, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే జఫర్‌గఢ్, చిల్పూరు, బచ్చన్నపేట, నర్మెట మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించిన సమావేశాల్లో అధికారులు పాల్గొని మాట్లాడారు. తాగు నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను ముందుగానే గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. తాగునీటి బోర్లు, హ్యాండ్ పంపులు మరమ్మతు ఉంటే చేయించాలని చెప్పారు. ఆయా సమావేశాల్లో మిషన్ భగీరథ ఈఈ శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుకన్య, విజయలక్ష్మి, ఏఈ భూక్య రజిత, ఎంపీడీఓలు సుమన్, మల్లికార్జున్, గ్రిడ్ డిప్యూటీ డీఈ సూర్య, కోటేశ్వర్, ఏపీఓ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శతాబ్ది సభను జయప్రదం చేయండి



రఘునాథపల్లి: జిల్లా కేంద్రంలోని కామాక్షి ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్న సీపీఐ శతాబ్ది బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కావటి రాజయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని గబ్బెట, కోడూర్, కంచనపల్లిలో ఆయన పార్టీ కార్యకర్తలతో కలిసి సభ కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు పసుల డానియేలు, చిట్యాల ఉప్పలయ్య, జనిగిల అంజయ్య, వెంకన్న, యాదయ్య, మల్లయ్య, సోమయ్య పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



చిల్పూరు: అవగాహన ర్యాలీలో పోలీసులు

- సీఐ మహేందర్‌రెడ్డి

పాలకుర్తి టౌన్: ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సిద్ధార్థ విద్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగామన కల్పించారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రిన్సిపాల్ జక్కుల రవీందర్, ఎస్సై లింగారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్‌లు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

చిల్పూరు: రోడ్డు భద్రత అందరి బాధ్యత అని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామంలో శుక్రవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని రోడ్డు భద్రతపై ప్రజలు, వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనం నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కానిస్టేబుల్ చారి తదితరులు ఉన్నారు.

రోడ్డు నిబంధనలు విస్మరిస్తే ప్రాణాపాయం

దేవరుప్పుల: రహదారుల్లో పెరుగుతున్న రద్దీ నేపథ్యంలో వాహనదారులు రోడ్డు నిబంధనలు విస్మరిస్తే ప్రాణాపాయం అనివార్యమని ఎస్సై ఊర సృజన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జనగామ–సూర్యాపేట రహదారి చౌరస్తాలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా నియమావళిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. విధిగా వాహనదారులు తగు ధృవ పత్రాలతోపాటు మోటారు సైకిల్ కలిగిన వారు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే జైలు పాలవడం ఖాయని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది, యువత పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం



జనగామ రూరల్: క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని రిటైర్డ్ కల్నల్ డాక్టర్ భిక్షపతి అన్నారు. ఏబీవీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రిస్టన్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్స్ శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భిక్షపతి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. క్రికెట్ పోటీల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టు విన్నర్స్‌గా, ఏరియా హాస్పిటల్ ట్రైనర్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హృతిక్, గుంటుపల్లి కార్తీక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉమర్, మహేందర్, నితీష్, గణేష్ ,సాయి, శ్రవణ్, దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

మరమ్మతు పనులు పూర్తిచేయాలి

- అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్



అధికారులతో మాట్లాడుతున్న పింకేష్‌కుమార్

పాలకుర్తి: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపడుతున్న మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ అన్నారు. శుక్రవారం పాలకుర్తి మండలం దర్దేపల్లి, విస్నూరు, చెన్నూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి ఫ్లోరెన్స్, జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్, ఎంపీడీఓ ఆకుల రాములు, ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, ఇంజనీరింగ్ అధికారాలు,పాఠశాలాల హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎస్సీల అభ్యున్నతికి ఐక్యఉద్యమాలు

దేవరుప్పుల: రాజకీయాలకతీతంగా ఎస్సీల అభ్యున్నతి కోసం సంఘటితమై ఐక్య ఉద్యమాలను చేపట్టాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పడమటింటి నర్సింహ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని కడవెండిలో ఎమ్మార్పీఎస్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈనెల 7వ తేదీన జరిగే వేల గొంతుకలు–లక్ష డప్పులు భారీ ప్రదర్శనను విజయవంతం చేయాలని ప్రచార ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్సీకాలనీలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద రాజ్యాంగకర్త చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజా సంఘాల నాయకులు జీడి ఎల్లయ్య, భాషిపాక ఉప్పలయ్య, సులుగూరి మహేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు సుదర్శన్, కిరణ్, యాదగిరి లు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటినే తాగాలి



బచ్చన్నపేట: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు స్వచ్ఛమైన నీటినే తాగాలని, అప్పుడే ఆరోగ్య సమస్యలు తలెత్తవని మండల విద్యాధికారి ఇర్రి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సెకండరీ పాఠశాలలో వైటెక్ సొల్యూషన్ ఆసియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పాటుపడుతున్న స్వచ్ఛం సంస్థ సభ్యుల సేవలు అభినందనీయమని అన్నారు. హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, సంస్థసభ్యులు జొన్నల శ్రీనివాస్, అనూష, శ్రావ్య, రోహిత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన

తరిగొప్పుల: మండలంలోని నర్సాపూర్ గ్రామంలో శుక్రవారం సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగేశ్వరాచారి పౌరహక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై కాసర్ల రాజయ్య, ఏఓ మనోహిత్ విక్రమరావు,ఆర్‌ఐ రవీందర్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, రామరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అధికారుల విచారణ

దేవరుప్పుల: ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులను తరలించే బస్సులు, డ్రైవర్ల సంబంధించి నిర్దేశిత పత్రాల నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న తీరుపై ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఆదేశాలతో విద్యాశాఖ అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ విషయమై మండల కేంద్రంలోని బాలయేసు హైస్కూల్‌లో ఉన్న బస్సులు, డ్రైవర్ లైసెన్స్ తదితర సమస్యలపై విచారణ అధికారులు.. ఎంఈఓ రాజేందర్, ఏసీజీ రవికుమార్‌ల ఆధ్వర్యంలో ఆరా తీశారు. ఈ విషయమై వారు మాట్లాడుతూ పాఠశాల నిర్వహణ తీరు వాస్తవిక నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రఘునాథపల్లి: మండలంలోని వెల్ది మోడల్ స్కూల్‌లో 6 తరగతిలో 100 సీట్లకు, 7 నుంచి 10 తరగతుల్లో ఖాళీ సీట్ల ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఆన్‌లైన్‌లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని, ఈ నెల 28వ తేదీ చివరి గడువన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

నేడు జనగామకు మంద కృష్ణ రాక

జనగామ రూరల్: జనగామలో నిర్వహించే వేల గొంతులు–లక్ష డప్పుల సన్నాహక ప్రదర్శన ర్యాలీకి శనివారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ రానున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ తెలిపారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి, ఛాగల్లు గ్రామాలను మున్సిపాలిటీగా ప్రకటించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర ఫ్లెక్సీకి కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సింగపురం దయాకర్, నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



తరిగొప్పుల: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కులస్తుల ఆరాధ్యదైవమైన వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చెప్యాల సతీష్‌శర్మ ఆధ్వర్యంలో చేపట్టారు. కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు జిడిగం భిక్షపతి, బెజుగం లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు వేణుగోపాల్, కృష్ణమూర్తి, రవితేజ, శ్రీనివాస్, శివశంకర్, కనుకయ్య, మహేష్, రామరాజేశం, రాజశేఖర్, చంద్రశేఖర్, వేణుగోపాల్, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

పంచగుళ్లలో..

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో పంచగుళ్లలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితుడు గంగు రఘుశర్మ, ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

కేసు నమోదు

జఫర్‌గఢ్: మండలంలోని ఉప్పుగల్లు గ్రామానికి చెందిన తల్లీకూతురు బండి రేణుక, వెంకటమ్మలపై ఇదే గ్రామానికి చెందిన అబ్బరబోయిన రవి గొడ్డలితో దాడి చేయగా అతడిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై రామ్‌చరణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రవి పాత గొడవలను దృష్టిలో పెట్టుకుని రేణుక, వెంకటమ్మలను దుర్భాషలాడుతూ వారిపై గొడ్డలితో దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలు రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వ్యక్తి అరెస్టు

తరిగొప్పుల: అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వక కాలయాపన చేస్తూ మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీదేవి తెలిపారు. శుక్రవారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మరియాపురం గ్రామానికి చెందిన బీరెడ్డి ఇన్నారెడ్డి, అల్లం శైలజ వద్ద హైదరాబాద్‌కు చెందిన బీరెడ్డి మరియాలీన, బీరెడ్డి అనిల్ రెడ్డిలు అక్కరనిమిత్తం రూ. 2.66 కోట్లు అప్పుగా తీసుకున్నారు. అట్టి డబ్బులను ఇవ్వకపోగా తప్పించుకు తిరుగుతుండడంతో 2024లో తరిగొప్పుల పీఎస్‌లో వారు ఫిర్యాదు చేశారు. దీంతో వారిపై ఛీటింగ్ కేసు పెట్టి ఈ కేసులో ఏ–2 బీరెడ్డి మరియాలీనను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చామన్నారు. జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఏ–1 అనిల్‌రెడ్డి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

‘సోనియాగాంధీ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి’

దేవరుప్పుల: గిరిజన సమాజాన్ని అవమానపర్చేలా రాష్ట్రపతి ద్రౌపతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సోనియాగాంధీ ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ రాజశేఖర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భారత రాష్ట్రపతి ద్రౌపతిని ఓల్డ్ పూర్ లేడీ అని అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ దేశ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గిరిజన మహిళ రాష్ట్రపతిగా ఉండడం కాంగ్రెస్ పా ర్టీకి, సోనియా గాంధీకి ఇష్టం లేదని తెలుస్తోందన్నారు.

స్తంభాలు తొలగించి రోడ్డు పనులు చేపట్టాలి

జఫర్‌గఢ్: మండలంలోని తమ్మడపల్లి (జి)లో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులను విద్యుత్ స్తంభాలను కూడా తొలగించి ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యతతో చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పార్టీ గ్రామ కార్యదర్శులు రాజు, సుధాకర్, ఎండి షబానా, రవి, యాకయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

మూడు ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్ చోరీ

రఘునాథపల్లి: ఇబ్రహీంపూర్, మాధారం, సోమయ్యకుంటతండాలో వ్యవసాయ బావుల వద్ద ఉన్న మూడు ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు పగులగొట్టి అందులోని కాపర్ వైర్ చోరీ చేసిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇబ్రహీంపూర్‌లో లక్ష్మీతండా రహదారిపై దొరగొల్ల మల్లయ్య పొలం వద్ద ఉన్న 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను, సోమయ్యకుంటతండా సమీపంలోని 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు పగులగొట్టి కేబుల్ చోరీ చేశారు. అదే విధంగా మాధారంలో కెనాల్‌పై మారబోయిన రాజు వ్యవసాయ భూమి వద్ద ఉన్న 16 కేవీ ట్రాన్స్‌ఫార్మను పగులగొట్టి అందులోని కాపర్‌ను చోరీ చేశారు. రెండేళ్ల క్రితం ఇదే ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు పగులగొట్టి కాపర్ వైర్‌ను అపహరించారు. శుక్రవారం ఉదయం వ్యవసాయ బావుల వద్దకు వెళ్లిన రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించారు. మూడు గ్రామాల్లో జరిగిన ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్‌వైర్ చోరీ ఒకే ముఠా చేసినట్లు తెలుస్తుంది. అర్ధరాత్రి సమయాల్లో దొంగలు సంచరిస్తుండంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కాగా, మూడు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల కాపర్‌వైర్ చోరీపై రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఖిలాషాపూర్ విద్యుత్ ఏఈ ఏ రవీందర్ తెలిపారు.

ఉద్యోగికి విరమణ సహజం

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

రఘునాథపల్లి: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్టేషన్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పి.ఇన్నారెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 24 యేళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో అంకితబావంతో పని చేస్తూ ఎందరో విద్యార్థులను ఉన్నత స్థాయికి ఎదగడానికి కృషి చేశాడన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఇన్నారెడ్డి–మేరి దంపతులను సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు సన్మానించారు. మండల విద్యాశాఖాధికారి రఘునందన్ రెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎల్ఎం.ఉపేందర్, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్, రాష్ట్ర కార్యదర్శి రంజిత్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఎండీ షరీఫా, శ్రీనివాసరావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రేణుక, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి



రాజు

స్టేషన్‌ఘన్‌పూర్ : శ్రీరాం సిటీ ఫైనాన్స్ తనను మోసం చేసిన క్రమంలో తనకు న్యాయం చేయాలని మండలానికి చెందిన గోనెల రాజు ప్రభుత్వాన్ని కోరాడు. పట్టణంలో శుక్రవారం ఆయన మీడియా ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. ఇంటి నిర్మాణం కోసం తాను శ్రీరాం సిటీ ఫైనాన్స్ కాజీపేట బ్రాంచ్ నుంచి లోన్ తీసుకుని వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద డబ్బు చెల్లించినప్పటికీ తనకు ఇంటి పత్రాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. తనకు జరిగిన అన్యాయంపై వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ)కు ఫిర్యాదు చేయగా సమస్య పరిష్కరిస్తామని శ్రీరాం సిటీ ఫైనాన్స్ జీఎం శ్రీనివాస్, జనగామ డీఎం రమేశ్, కాజీపేట డీఎం వెంకట్ హామీ ఇచ్చి మోసం చేసిన మరో మేనేజర్ రఘు చేత బాండ్ రాయించి ఇచ్చారని తెలిపాడు. ఎన్‌ఓసీ అడిగితే మేనేజర్ రఘు బదిలీ అయ్యాడంటూ మోసగిస్తున్నారని వాపోయాడు. తనకు ఇంటి పత్రాలు ఇప్పించి న్యాయం చేయాలని కోరాడు.